తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
సోమవారం
22 జూన్ 2026
పేజీలు : 8
Follow :

# యోగాతోనే మానసిక, శారీరక ఆరోగ్యం

○ జీవితంలో యోగా భాగం కావాలి

○ ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణ రావు



**పెద్దపల్లి,జూన్ 21(జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వ ఆయుష్ విభాగం మరియు జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో "యోగ ఫర్ హెల్తీ ఏజింగ్ " అనే ఇతివృత్తంతో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం నిర్వహించిన యోగా శిబిరంలో పాల్గొని అధికారులు, విద్యార్థులు,ప్రజాప్రతినిధులతో కలిసి యోగా ఆసనాలు వేసి అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ముందుగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు కి మొక్క అందజేసి అధికారులు స్వాగతం పలికారు. అనంతరం అధికారులు మరియు ప్రజా ప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి యోగా కార్యక్రమాన్ని విజయరమణ రావు ప్రారంభించారు,మాట్లాడుతూ భారతదేశం అనేది యోగా కు పుట్టినిల్లు అని ప్రపంచ దేశాల్లో యోగా చేయడం మన దేశానికి గర్వకారణమని ప్రాచీన కాలం నుండి అలవాటుగా యోగా ద్వారా ఒత్తిడి లేని, ఆరోగ్య కరమైన జీవన శైలి ని అలవర్చుకోవచ్చునని యోగా చేయడం ద్వారా అనారోగ్య సమస్యల నుండి విముక్తి పొందవచ్చునని అన్నారు. యోగ వ్యాయామమే కాకుండా అదొక జీవన విధానానికి మానసిక స్థిరత్వానికి దోహదపడుతుందని అలాగే సమాజంలో అశాంతి అస్థిరత పెరుగుతుందని దీనికి విరుగుడుగా యోగ తోనే శాంతి సిద్ధిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య,జిల్లా వైద్యాధికారి, కే ప్రమోద్ కుమార్,డీసీపీ, రామ్ రెడ్డి, సీఐ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ పోలీస్ అధికారులు మరియు ఆయుష్ డిపార్ట్మెంట్ అధికారులు,మరియు యోగా పండితులు, పలు శాఖల అధికారులు మరియు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు మరియు యోగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి..

- యోగాతో ఒత్తిడి ఉపశమనం..ఆరోగ్యానికి భరోసా..

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా..

**గోదావరిఖని, జనంసాక్షి:** నేటి జీవన విధానంలో మనిషి అనేక ఒత్తిళ్లకు గురవుతున్నాడని, యోగా ద్వారా వాటి నుంచి ఉపశమనం పొందవచ్చని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ మైదానంలో యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్, అధికారులు, సిబ్బందికి యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.యోగా అనేది ఒకరోజు నిర్వహించే కార్యక్రమం కాదని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాల్సిన ఆరోగ్య సాధనమని పేర్కొన్నారు.యోగా చేయడానికి ప్రత్యేకమైన పరికరాలు గానీ, ఇతరుల సహకారం గానీ అవసరం లేదని, వ్యక్తిగత నిబద్ధత, సంకల్పం ఉంటే సరిపోతుందని అన్నారు.ఆరోగ్యమే మహాభాగ్యమని, మంచి ఆరోగ్యం మనిషికి అత్యంత విలువైన ఆస్తి అని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది సాధారణంగా శారీరక దృఢత్వానికి అధిక ప్రాధాన్యత ఇస్తారని, కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న యువ పోలీస్ సిబ్బందిని అభినందించారు ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్రగౌడ్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అఫ్జలోద్దీన్,రామగుండం సీఐ కృష్ణకుమార్, ఆర్ఐలు దామోదర్, మల్లేశం,శేఖర్,రమేష్, ఎస్ఐలు,ఆర్ఎస్ఐలు,ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ యోగా శిక్షకురాలు రాధిక తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ లో ఘనంగా వరల్డ్ ఫాదర్స్ డే వేడుకలు



**కరీంనగర్ బ్యూరో, జూన్ 21 (జనంసాక్షి) :** తండ్రి పాత్ర చాలా విశిష్టమైనది అతడు అనుసరించే విధానం చాలా ప్రేమ, ఆప్యాయతతో కూడుకున్నటువంటిదని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో వరల్డ్ ఫాదర్స్ డే సందర్భంగా నిర్వహించినటువంటి ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి సరస్వతి మాతకు పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని వేడుకగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కుటుంబ పోషణను తండ్రి చూసుకుంటాడని తండ్రి అమూల్యమైనటువంటి పాత్ర వలనే సమాజాభివృద్ధి చెందుతున్నదని, కుటుంబంలో ప్రతి ఒక్కరు సుఖసంతోషాలను అనుభవిస్తారని తెలిపారు. తండ్రి బాధ్యతలు చాలా అత్యున్నతమైనవని, అనంతమైనవని, ప్రథమ పూజ్యుడు అయినటువంటి శ్రీ మహాగణపతి సైతం తండ్రి విధానం ఆచరించి ఉన్నతమైన స్థానాలలో ఉన్నతమైన స్థానాన్ని ఏర్పరచుకోవడమే కాకుండా అన్ని దేవుళ్ళ కంటే ముందుగా పూజింపబడతాడని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ తండ్రి అయినటువంటి బాటను అనుసరించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు సూచించారు. ప్రత్యేకంగా తల్లిదండ్రులు ఫైర్లెస్ కుకింగ్ కార్యక్రమంతో వారి వంట చేసే విధానాన్ని తెలియపరిచారు. చక్కటి ప్రదర్శన కనబరిచిన తల్లిదండ్రులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇన్స్పైర్ మనక్ జాతీయ మెంటరింగ్ శిబిరానికి పారమిత విద్యార్థులకు ఆహ్వానం

**పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద్ రావు..**

**కరీంనగర్ అర్బన్, జూన్ 21 (జనంసాక్షి) :** స్థానిక కరీంనగర్, పద్మనగర్ లోని పారమిత హెరిటేజ్ స్కూల్ విద్యార్థులు ఎం. చెగువేరా, కె. వికాస్ లకు , జూన్ 22 నుండి 24 వరకు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్లో నిర్వహించనున్న ఇన్స్పైర్ మనక్ జాతీయ మెంటరింగ్ శిబిరం లో పాల్గొనే అరుదైన అవకాశం లభించిందని పాఠశాల డైరెక్టర్ హన్మంత రావు తెలిపారు. భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని జాతీయ ఆవిష్కరణల సంస్థ, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి, ఎన్.ఐ.టి. వరంగల్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా

మిగతా 2లో



# మాధవ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**కరీంనగర్ బ్యూరో, జూన్ 21 (జనంసాక్షి) :** ప్రపంచానికి భారత్ అందించిన గొప్ప కానుక 'యోగ' అని, నిత్యం యోగా సాధన చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని మాధవ సేవా సమితి అధ్యక్షులు దుర్శెట్టి నిరంజనాచారి, ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కరీంనగర్, కోతి రాంపూర్ లోని గిద్దెపెరుమాండ్ల దేవాలయ మైదానంలో మాధవ సేవా సమితిఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక యోగా శిబిరాన్ని అత్యంత ఉత్సాహంగా , ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాధవ సేవా సమితి అధ్యక్షులు దుర్శెట్టి నిరంజనాచారి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ అధికారి శ్రీనివాస్ పాల్గొనగా, ఆర్ఎస్ఎస్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్ ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, "యోగా అనేది కేవలం ఆసనాలకే పరిమితం కాదు, ఇది ఒక సంపూర్ణ జీవన విధానం. యువతకు పిలుపు ప్రధాన వక్త సామల కిరణ్ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, "భారతదేశ జనాభాలో సుమారు 40 శాతం మంది యువత ఉన్నారు. ఈ యువశక్తే దేశ భవిష్యత్తుకు వెన్నెముక. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, యోగా ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలి. దేశాభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించి, సమాజ హితానికి పాటుపడాలి" అని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలు, యోగా ఆసక్తిపరులు, మాధవ సేవా సమితి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, వివిధ ఆసనాలను నిపుణుల పర్యవేక్షణలో అభ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో మాధవ సేవా సమితి ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

# ఘనంగా ఒలింపిక్ డే రన్ నిర్వహణ

**కరీంనగర్ జూన్ 21 (జనంసాక్షి) :**
ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఒలింపిక్ డే రన్ ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల నుంచి ప్రారంభమైన ఈ రన్‌కు జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించి, ఒలింపిక్స్ ఆదర్శాలను పరిచయం చేయడంలో ఒలింపిక్ డే రన్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. క్రీడా సంఘాలను సమన్వయం చేస్తూ క్రీడారంగ అభివృద్ధికి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ విశేష కృషి చేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్రాలకు పేరు తీసుకురావాలని సూచించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్ మాట్లాడుతూ, సుదీర్ఘ చరిత్ర కలిగిన ఒలింపిక్ అసోసియేషన్ క్రీడా సంఘాలు, ప్రభుత్వం మధ్య వారధిగా పనిచేస్తూ క్రీడారంగ పురోగతికి తోడ్పడుతోందన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న క్రీడా మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుని యువత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అధిక నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. అనంతరం అతిథులు క్రీడా జ్యోతిని వెలిగించి రన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ నాయకులు తుమ్మల రమేష్ రెడ్డి, కన్న కృష్ణ, నాగిరెడ్డి సిద్ధారెడ్డి, లక్ష్మణ్, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం నాయకులు బాబు శ్రీనివాస్ గౌడ్, ఆడెపు శ్రీనివాస్, అంతర్జాతీయ పారా క్రీడాకారిణి అంజనా రెడ్డి, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు. ఈ రన్‌లో సుమారు 300 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.







# ఇన్స్పైర్ మనక్ జాతీయ మెంటరింగ్ శిబిరానికి పారమిత విద్యార్థులకు ఆహ్వానం

## పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద్ రావు..

శాస్త్రీయ ఆవిష్కరణల ఆధారంగా ఎంపికైన 30 మంది విద్యార్థుల్లో చెగువేరా, వికాస్‌లు చోటు సంపాదించడం విశేషం అని, వారు గత సంవత్సరం నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో, వారి మార్గదర్శకుడు లలిత్ మోహన్ సాహు పర్యవేక్షణలో రూపొందించిన ప్రాజెక్టు ద్వారా, కరీంనగర్ జిల్లా నుండి ఇన్స్పైర్ మనక్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారని, చెగువేరా "సౌరశక్తితో పనిచేసే ధాన్యపు వేర్పాటు యంత్రం" అభివృద్ధి చేయగా, వికాస్ "బహుళ ప్రయోజన స్టడీ డెస్క్" రూపొందించాడని,
ఈ మెంటరింగ్ శిబిరంలో పాల్గొనే విద్యార్థులు దేశంలోని ప్రముఖ శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు, పరిశోధకులతో ప్రత్యక్షంగా సంభాషించే అవకాశం పొందనున్నారు. అలాగే ఈ ఏడాది చివర్లో జరగనున్న జాతీయ స్థాయి ప్రదర్శన, ప్రాజెక్ట్ పోటీ కోసం తమ ప్రాజెక్టులను మరింత మెరుగుపరచుకునేందుకు నిపుణుల మార్గదర్శకత్వం అందుకోనున్నారు. ఈ సందర్భంగా జాతీయ మెంటరింగ్ శిబిరానికి ఎంపికైన విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద్ రావు, డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, రాకేష్, వి.యు.యం. ప్రసాద్, వినోద్, హనుమంతరావు, ప్రిన్సిపాల్ గోపికృష్ణ, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందిస్తూ, వారి భవిష్యత్తులో మరిన్ని గొప్ప విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా ప్రొఫెసర్ జయ శంకర్ వర్ధంతి వేడుకలు

**మల్లాపూర్,జూన్ 21(జనంసాక్షి )**
మండల కేంద్రం లో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ మాట్లాడుతూ 50 ఏళ్లు తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడారు. తెలంగాణ ఎందుకు కావాలి అని లెక్కలతో, డేటాతో ప్రూవ్ చేశారు. 1969 ఉద్యమంలో విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కె.సి.ఆర్ కి కూడా గురువు అని అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ జెడ్పిటిసి కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ఎల్లాల జలపతి రెడ్డి,మానాల నాగయ్య,ఉప సర్పంచ్ గడ్డం సోమరెడ్డిమండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాట్ల సోమయ్య,మాజీ వన సంరక్షణ సమితి చైర్మన్ సిరిపురం రవీందర్,వార్డు సభ్యులు కొంపెల్లి రాకేష్,మహమ్మద్ రఫీ, ముద్దం చంద్ర ప్రకాష్ గౌడ్,కమల వాటర్ పెరుమాండ్ల రాజేందర్ గౌడ్ పల్లికొండ నారాయణ,సామాజిక కార్యకర్త, ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# చేనేత సహకార సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

వీణవంక జూన్ 21(జనం సాక్షి)
వీణవంక మండలంలోని వీణవంక,కోర్కల్,చేనేత సహకార సంఘాల ఉత్పతి,విక్రయ చేనేత సహకార సంఘం అధ్యక్షుల తోపాటు పాలక వర్గాలను ఆదివారం రోజున డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు ఎన్నికల అధికారులు జి.రూప,పి.సురేందర్ రెడ్డి లు తెలిపారు.వీణవంక చేనేత సహకార సంఘం అధ్యక్షులు జడల పద్మలత రమేష్,ఉపాధ్యక్షునిగా ఉయ్యాల రాజయ్య,కోశాధికారిగా చిందం సదానందం తోపాటు నూతనంగా ఆరుగురు పాలక డైరెక్టర్లు ఎన్నికయ్యారు.మండలంలోని కోర్కల్ చేనేత సహకార సంఘం అధ్యక్షునిగా అడిగొప్పుల సత్యనారాయణ, ఉపాధ్యక్షురాలిగా అడిగొప్పుల నిర్మల సత్యనారాయణ,కోశాధికారిగా బొద్దుల భావన ఋషిల తోపాటు ఆరుగురు నూతన పాలక వర్గ డైరెక్టర్లను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా,అధికారులు వారిని ప్రమాణ స్వీకారం చేయించి ఎన్నిక నియామక పత్రాలను అందజేశారు.అనంతరం నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘాల అధ్యక్షులు మాట్లాడుతూ సంఘాభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.మమ్మల్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న చేనేత సహకార సంఘాల సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ సంఘ అభివృద్ధి తోపాటు కార్మిక సంక్షేమం కోసం కృషి చేస్తామని వీణవంక,కోర్కల్ చేనేత సహకార సంఘాల అధ్యక్షులు జడల పద్మలత రమేష్,అడిగొప్పుల సత్యనారాయణ లు తెలియజేశారు.చివరి సారిగా 2013లో ఎన్నికల నిర్వహించారు. పాలకవర్గల గడువు 2018 సంవత్సరంలో ముగిసింది.ఎన్నికలు నిర్వహించకుండా గత ప్రభుత్వం పాలకవర్గాల గడువు పొడిగిస్తూ మే 2026 సంవత్సరానికి ముగిసింది. చివరకు చేనేత సహకార సంఘం ఎన్నికల నిర్వహించగా ఎన్నికల ప్రక్రియ ఆదివారం రోజున ముగిసింది.

# భూషణరావుపేటలో పోచమ్మ బోనాల పండుగ

**కథలాపూర్ జూన్ 21 జనంసాక్షి)**
కథలాపూర్ మండలంలోని భూషణరావుపేట గ్రామంలో ఆదివారం రోజున గంగపుత్రుల ఆధ్వర్యంలోని గ్రామ సర్పంచ్ మహేందర్ మరియు గ్రామ విడిసి పెద్దమనుషుల ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండగ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భూషణరావుపేట గ్రామ మహిళలు అమ్మవారికి బోనం సమర్పించి మొక్కలు చెల్లించడం జరిగింది ప్రజలు అందరూ పోచమ్మ తల్లికి మంచిగా వర్షాలు పడి అందరు మంచి ఉండాలని కోరుకొని మొక్కలు చెల్లించుకోవడం జరిగింది . ఈ కార్యక్రమంలోని గ్రామ ప్రజలు గ్రామ సర్పంచ్ మహేందర్ ఉప సర్పంచ్ గంగ పోశయ్య వార్డు మెంబర్లు అరుణ్ ప్రశాంత్ నాగరాజు సంపత్ రెడ్డి దేవక్క మైదిన్ మరియు విడిసి మెంబర్లు టీ.మహేష్, సిహెచ్ మహేష్, శ్రీకాంత్ మామిడిపల్లి లింగారెడ్డి మరియు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.



# కరీంనగర్ 1 టౌన్ పరిధిలో పేకాట స్థావరం పై దాడి - 12 మంది అరెస్ట్

## రూ. 37,670 నగదు, 12 మొబైల్ ఫోన్లు స్వాధీనం..

## ఒక కారు, 3 ద్విచక్ర వాహనాలు సీజ్..

## టాస్క్ ఫోర్స్ ఏసీపీ వాసాల సతీష్..

**కరీంనగర్ బ్యూరో, జూన్ 21 (జనంసాక్షి) :**
లోని 1టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల కాపువాడలోని ఒక ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట (త్రీ కార్డ్స్) స్థావరంపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో బెట్టింగ్ రాయుళ్ల ఆట కట్టించి, భారీగా నగదు, వాహనాలను స్వాధీనం చేసుకున్నామని కరీంనగర్ టాస్కోర్స్ ఎసిపి వాసాల సతీష్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు కాపువాడలోని సదరు ప్రైవేట్ నివాసం పై దాడి చేశామని, డబ్బు పణంగా పెట్టి జూదం ఆడుతున్న 12 మంది వ్యక్తులను అక్కడికక్కడే అదుపులోకి తీసుకున్నామని, జూదరుల నుండి రూ. 37,670 నగదును స్వాధీనం చేసుకున్నామని, వారి వద్ద ఉన్న 12 మొబైల్ ఫోన్లను సీజ్ చేశామని టాస్క్ ఫోర్స్ ఎసిపి వాసాల సతీష్ తెలిపారు.

**నిందితులకు సంబంధించిన వాహనాలు**
ఒక రెనాల్ట్ కారు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, అరెస్టయిన నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న నగదు, మొబైల్ ఫోన్లు, వాహనాలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కరీంనగర్ 1 టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించడం జరిగిందని నగరంలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్ ఫోర్స్ ఏసిపి వాసాల సతీష్ హెచ్చరించారు.

# ఫాదర్స్ డే సందర్భంగా ఉచిత థైరాయిడ్ స్క్రీనింగ్ శిబిరాలు

**కరీంనగర్ టౌన్, జూన్ 21 ( జనం సాక్షి)**



ఫాదర్స్ డే సందర్భంగా కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఉచిత థైరాయిడ్ హార్మోన్ స్క్రీనింగ్ శిబిరాలకు విశేష స్పందన లభించింది. వాసుదేవ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎలగందల శ్రీనివాస్ మరియు అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 137-ఏ ఆధ్వర్యంలో ఈ శిబిరాలు నిర్వహించబడ్డాయి.కరీంనగర్‌లోని వాసుదేవ హాస్పిటల్‌లో ఉచిత థైరాయిడ్ పరీక్షలు నిర్వహించగా, ఇల్లంతకుంటలో దివంగత అల్లాడి ఆంజనేయ శర్మ స్మారకార్థం ఆయన నివాసంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అలాగే రహీంఖాన్పేటలో నూతన అలయన్స్ క్లబ్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం సందర్భంగా కూడా ఉచిత థైరాయిడ్ స్క్రీనింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ ఎలగందల శ్రీనివాస్, ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉచిత స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరంలో పాల్గొన్న వారికి మూడు నెలల పాటు ఉచిత వైద్య సలహాలు అందించడంతో పాటు, అవసరమైన ఇతర వైద్య పరీక్షలను ప్రత్యేక రాయితీ ధరలకు అందిస్తామని వెల్లడించారు.మూడు కేంద్రాల్లో కలిపి మొత్తం 155 మంది థైరాయిడ్ పరీక్షల కోసం రక్త నమూనాలు అందించారు. వాసుదేవ హాస్పిటల్‌లో 50 మంది, ఇల్లంతకుంటలో 70 మంది, రహీంఖాన్పేటలో 35 మంది నమూనాలు సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్ రాజ్, డాక్టర్ అశోక్, డాక్టర్ సాయి మేఘన, డాక్టర్ తేజ, డాక్టర్ సాయి ప్రీతమ్‌తో పాటు వాసుదేవ హాస్పిటల్ సిబ్బంది, అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొంజర్ల మహేష్, కోల అన్నారెడ్డి, పుల్లల శ్యామ్, ప్రసాద్, సాగర్, పండుగ నాగరాజు, కుమారస్వామి, నాగేశ్వర్, వెంకటేశ్వర్లు, అల్లాడి ఆనంద్ కుమార్, మాటేటి శ్రీనివాస్, గడ్డమీది శ్రీనివాస్, రాజేందర్, అశోక్, పరశురాములు, అంతగిరి వినయ్ తదితరులు పాల్గొన్నారు. శిబిరాల విజయవంతానికి వైద్యులు, అలయన్స్ క్లబ్ సభ్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు సహకరించారు.

# సింగరేణిలో అత్యంత పకడ్బందీగా నిర్వహణ

## - బొగ్గుపై పటిష్ట పర్యవేక్షణ..

## - సింగరేణి ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్..



గోదావరిఖని, జనంసాక్షి:

సింగరేణి అత్యంత పకడ్బందీగా బొగ్గు రవాణా..ప్రతి టన్ను బొగ్గుపై పటిష్ట పర్యవేక్షణ.. అత్యాధునిక సాంకేతికత..పారదర్శక రవాణా వ్యవస్థను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని ఆర్‌జీ-1 జీఎం డి.లలిత్‌కుమార్ అన్నారు. గోదావరిఖనిలోని ఓ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు రవాణ తదితర విషయాలపై వివరాలు వెల్లడించారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) మైనింగ్ రంగంలో 137 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక సంస్థ అని ఆయన పేర్కొన్నారు.దేశ ఇంధన భద్రతకు వెన్నెముకగా నిలుస్తూ, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, పారిశ్రామిక వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేస్తూ జాతీయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు.ఇటీవల సింగరేణిలో బొగ్గు మాయమైందని, భారీ స్థాయిలో బొగ్గు చోరీలు జరిగాయని చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు దూరంగా ఉండటమే కాకుండా, సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు.ఈ నేపథ్యంలో సింగరేణిలో అమలులో ఉన్న బొగ్గు రవాణా, భద్రతా వ్యవస్థలు, సాంకేతిక పర్యవేక్షణ విధానాల గురించి కొన్ని వాస్తవాలను మీతో పంచుకోవడం అవసరమని భావిస్తున్నామని జీఎం లలిత్‌కుమార్ అన్నారు.

**బొగ్గు రవాణా వ్యవస్థ:**

సింగరేణిలో ఉత్పత్తి అయ్యే బొగ్గు సుమారు 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం ద్వారా వినియోగదారులకు సరఫరా చేస్తున్నామన్నారు.బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుంచి వినియోగదారుడి వద్దకు చేరే వరకు ప్రతి దశలో డిజిటల్ పర్యవేక్షణ, భద్రతా తనిఖీలు, ఆన్‌లైన్ రికార్డింగ్ వ్యవస్థలు అమల్లో ఉంటాయన్నారు.

**రోడ్డు మార్గం ద్వారా బొగ్గు రవాణా:**

హైదరాబాద్‌లోని మార్కెటింగ్ విభాగం ద్వారా సాప్ ఆధారిత వ్యవస్థలో బొగ్గు కేటాయింపులు జరుగుతాయని జీఎం తెలిపారు.వినియోగదారుడు ఏ గని నుంచి, ఎంత పరిమాణంలో ఎప్పుడు బొగ్గు స్వీకరించాలో ముందుగానే డిజిటల్ లాగ్ కేటాయిస్తామన్నారు.ఈ వాహనం గని లేదా కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ) వద్దకు చేరిన వెంటనే ఖాళీ వాహనం బరువును ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జిపై నమోదు చేస్తామన్నారు.వాహనం నంబర్, వినియోగదారుడి వివరాలు సాప్ వ్యవస్థలో నమోదవుతాయన్నారు.నిర్దేశిత పరిమాణంలో బొగ్గు లోడింగ్ నిర్వహిస్తారు.. అనంతరం ఆర్‌ఎఫ్‌ఐడీ ఆధారిత బూమ్ బ్యారియర్లు కలిగిన వే బ్రిడ్జిల వద్ద మళ్లీ తూకం వేస్తాయడం జరుగుతుందన్నారు.కేటాయించిన పరిమాణానికి అనుగుణంగా బొగ్గు లోడ్ అయిన తర్వాత మాత్రమే కంప్యూటర్ జనరేట్ చేసిన అధికారిక వే-బిల్ జారీ చేసి వాహనాన్ని విడుదల చేస్తారన్నారు.వాహనం బయలుదేరిన వెంటనే ఆ సమాచారం వినియోగదారుడికి, మార్కెటింగ్ విభాగానికి సంబంధిత అధికారులకు ఆన్‌లైన్ ద్వారా చేరుతుందన్నారు.

**జీపీఎస్-జియోఫెన్సింగ్ ఆధారిత పర్యవేక్షణ:**

బొగ్గు రవాణా చేసే వాహనాలన్నింటికీ జీపీఎస్/జీపీఆర్‌ఎస్ ట్రాకింగ్ వ్యవస్థ అమలులో ఉంది. వాహనం ఎక్కడ ఉంది?ఏ మార్గంలో వెళ్తంది? ఎక్కడ ఆగింది?గమ్యస్థానానికి చేరిందా అనే వివరాలు రియలైమ్లో పర్యవేక్షించబడతాయి.జియోఫెన్సింగ్ సాంకేతికత కారణంగా వాహనం నిర్దేశిత మార్గం నుంచి మళ్లితే సంబంధిత గని మేనేజర్, ప్రాజెక్ట్ అధికారి, సెక్యూరిటీ ఆఫీసర్కు వెంటనే హెచ్చరికలు వెళ్తాయి. ఆర్‌ఎఫ్‌ఐడీ-సీసీటీవీ బూమ్ బ్యారియర్ల సమగ్ర నిఘా ఉంటుందన్నారు.సింగరేణి గనులు, వే-బ్రిడ్జీలు సీహెచ్‌పీ, ఎంట్రీ-ఎగ్జిట్ గేట్లు, రైల్వే సైడింగ్లు, స్టాక్ యార్డుల వద్ద ఆర్‌ఎఫ్‌ఐడీ ఆధారిత బూమ్ బ్యారియర్లు, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయబడ్డాయి.వందలాది సీసీటీవీ కెమెరాలు 24 గంటలూ పనిచేస్తూ ప్రతి కదలికను రికార్డు చేస్తున్నాయన్నారు.

**చెక్ పోస్టులు- భౌతిక తనిఖీలు:**

అన్ని ఎంట్రీ, ఎగ్జిట్ ద్వారాల వద్ద చెకోపోస్టులు,వాహనాల భౌతిక తనిఖీలు, హోలోగ్రామ్ కలిగిన అధికారిక చలానాలు,రైలు మార్గం ద్వారా బొగ్గు రవాణా,ఫ్యూయల్ సప్లై అగ్రిమెంట్ల (ఎఫ్‌ఎస్‌ఏ) ప్రకారం విద్యుత్ కేంద్రాలు మరియు ఇతర భారీ వినియోగదారులు సింగరేణి వివిధ సీహెచ్‌పీ నుంచి బొగ్గు స్వీకరిస్తారు.రైల్వే శాఖ కేటాయించిన రేకుల్లో..ప్రతి వ్యాగను నిర్దిష్ట పరిమాణంలో బొగ్గు లోడింగ్ జరుగుతుంది.మొత్తం ప్రక్రియ సాప్ ఆధారంగా నిర్వహించబడుతుంది.లోడింగ్ పూర్తయిన వెంటనే వినియోగదారునికి డిజిటల్ సమాచారం అందుతుంది.అనంతరం రైల్వే శాఖ బొగ్గును గమ్యస్థానానికి తరలిస్తుందన్నారు.'పారదర్శకత, బాధ్యత, సాంకేతికత-ఇవే సింగరేణి బొగ్గు నిర్వహణకు మూల సూత్రాలని జీఎం పేర్కొన్నారు.

# 12 సంవత్సరాల మోడి ప్రభుత్వంలో..

## - విశేష సంపర్క్ అభియాన్ కార్యక్రమం..

## - బీజేపీ నాయకురాలు సోమారపు లావణ్య..



గోదావరిఖని, జనంసాక్షి:

బీజేపీ నాయకురాలు సోమారపు లావణ్య ఆధ్వర్యంలో '12 సంవత్సరాల మోడి ప్రభుత్వంలో విశేష సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా రామగుండం మున్సిపల్ కార్మికులను ఘనంగా సన్మానించారు.సన్మాన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసిపేట శివాజీ, బిజెపి రాష్ట్ర నాయకులు సోమారపు అరుణకుమార్, మండల అధ్యక్షులు ఐత పవన్, నాయకులు కొమ్మ శ్రీనివాస్, ఇదునూరి మల్లేష్, చుక్కల రాములు, పంగా రవి,జనగాం శివరామకృష్ణ, కంపల్లి రఘు, పాశం రాజు, నరేష్ గౌడ్, సప్ప నాగరాజు, తాళ్లపల్లి శ్రీనివాస్, రాజకుమార్, మహేందర్,మాతంగికాలనీ బీజేపీ నాయకులు నరేందర్,భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశిష్ట సేవలను గుర్తించి మెమోంటోలు అందించారు.ఈ కార్యక్రమంలో వివిధ రంగాలలో సేవలందిస్తున్న ప్రముఖులను సత్కరించారు.వారిలో ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయులు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, విద్యారత్న అవార్డు గ్రహీత గొల్ల అంజన్‌కుమార్, అనుదీప్ ట్రస్ట్ చైర్మన్ అట్లూరి శశికళ, గుమ్మడి ఉజ్వల, గవర్నర్ మెడలిస్ట్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధి, నృత్యాఖని అకాడమీ ప్రతినిధులు, ఇస్కాన్ రామగుండం ఇన్‌చార్జ్ లావణ్య, అడ్వకేట్ ప్రవళిక పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాలలో అమలు చేసిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. దేశాభివృద్ధి, సేవాభావం, సంక్షేమం లక్ష్యంగా చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.



# ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పించిన టీబీజీకేస్ శ్రేణులు..

గోదావరిఖని, జనంసాక్షి:

స్థానిక టీబీజీకేఏస్ కేంద్ర కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్‌కు టీబీజీకేఏస్ శ్రేణులు నివాళులర్పించారు.ఆదివారం కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమరయ్య హాజరై మాట్లాడారు.తెలంగాణ ప్రధాత సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితాన్ని తెలంగాణ ఏర్పాటు కోసం త్యాగం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం స్థాపనలో కీలక భూమిక పోషించి జయశంకర్ స్ఫూర్తితోనే సింగరేణిలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆవిర్భవించిందన్నారు.కారుణ్య నియామకాలతో పాటు అనేక హక్కులు సాధించుకోవడం జరిగిందని, ఆయన ఆశయాల కనుగుణంగా ముందుకు సాగాలని,సంస్థ పరిరక్షణకు పోరాడాలని పిలుపునిచ్చారు.ఆర్‌జీ.వన్ ఉపాధ్యక్షులు వడ్డేపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, కేంద్ర కోశాధికారి చెల్పూరి సతీష్,పిట్ సెక్రటరీలు, నాయకులు జనగామ మల్లేష్, ఉప్పులేటి తిరుపతి,రొడ్డ సంపత్, మురళీకృష్ణ, అప్సర్‌పాష,పర్లపెల్లి అభిషేక్, దండే రవి, మీస రాజు, భాస్కర్, దేవేందర్,దండే యశ్వంత్, సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే సంపద..యోగానే మార్గం..

## బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సంధ్యారాణి..



**గోదావరిఖని, జనంసాక్షి:**

వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్యమే మహాభాగ్యమనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ గోదావరిఖని ఆర్యవైశ్య భవన్‌లో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా సాధనలో భాగమయ్యారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఆమె ప్రదర్శించిన వివిధ యోగా ఆసనాలు సభలోని ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను అందించే యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ 'యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు, అది మనిషి శరీరం, మనసు, ఆత్మను ఏకం చేసే గొప్ప భారతీయ సంస్కృతి సంపద" అని తెలిపారు. నేటి ఒత్తిడితో కూడిన జీవన విధానంలో యోగా ఆరోగ్యకరమైన జీవనానికి మార్గదర్శకమని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా భారతదేశ యోగా వైభవం మరింత విస్తరిస్తుండటం ప్రతి భారతీయుడు గర్వించాల్సిన విషయమని ఆమె అన్నారు. యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యోగ గురువు నరోత్తంరెడ్డి,యోగా గురువు రజనీ, బిజెపి సీనియర్ నాయకులు సులువ లక్ష్మీనారాయణ, బిజెపి మండల అధ్యక్షులు ఉరగొండ అపర్ణ, గుండబోయిన భూమయ్య,నాయకులు ఎల్తూరి సరిత, జక్కుల పద్మ, కోట తిరుమల, జక్కన రాజ్యలక్ష్మి, కోడూరి రమేష్, జక్కన్న బాలు, జక్కుల ప్రవీణ్ ,లక్ష్మీనరసయ్య, గంగరాజు, ఎల్తూరి రాజయ్య, పాకాల నరసింహారెడ్డి, సిలారపు కళ్యాణ్, వకుళాభరణం వేణు, జనగామ శివరాం యోగా సాధకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి యోగ..

**గోదావరిఖని, జనంసాక్షి:**



అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన యోగ అభ్యాసన ప్రత్యేక కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఏ.సాంబశివరావు మాట్లాడారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగ..ఈ థీమ్ ద్వారా శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడం,మానసిక ప్రశాంతతను పెంపొందించడం,వయస్సు పెరిగినా చురుకుదనాన్ని కొనసాగించడం, ఒత్తిడి,జీవనశైలి సంబంధిత వ్యాధులను తగ్గించడం వంటి ప్రయోజనాలను ప్రోత్సహిస్తున్నారని, అధ్యాపకులు, విద్యార్థులు యోగా సాధన చేయాలని పిలుపునిచ్చారు.తదనంతరం కళాశాల కామర్స్ అధ్యాపకుడు వి.ఆంజనేయులు, హెల్త్ కేర్ మేనేజ్మెంట్ విద్యార్థిని భార్గవి కలసి అధ్యాపకులకు,ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లుకు,ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు దైనందిన జీవితంలో అత్యధికంగా ఉపయోగపడే కొన్ని యోగాసనాలను సాధన చేయించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఏ,సాంబశివరావు, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ జి.సుబ్బారావు, డాక్టర్ సవిత, డాక్టర్ శారద, డాక్టర్ ఏం.నరేష్, డాక్టర్ అజయ్‌కుమార్, డాక్టర్ డి.కిరణ్మయి, డాక్టర్ పి.శ్రీదేవి, డాక్టర్ వి.కిరణ్‌కుమార్, డాక్టర్ వి.నరేష్, డాక్టర్ పి.ఉషారాణి,శ్రీలత,జలజా,అరుణమ్మ, భాగ్యలక్ష్మి, శంకరయ్య అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది భార్గవి,పాల్సన్‌రాజ్,సంతోష్,అభిషేక్ విద్యార్థులు పాల్గొన్నారు.

# వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ యోగా వేడుకలు







**సుల్తానాబాద్,జూన్ 21(జనంసాక్షి) :**
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన వాకర్స్, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, యోగా ఆసనాలు నిర్వహించారు.ఈ సందర్భంగా యోగా శిక్షకులు మురళీధర్, దేవరకొండ ప్రకాష్, కోడెం అజయ్, వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఒత్తిడి తగ్గి ప్రశాంత జీవనం సాధ్యమవుతుందని తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, స్థానిక కౌన్సిలర్ లు పాల్గొని, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజూ యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలని, యోగ ఒకరోజు కాకుండా ప్రతిరోజు చేస్తే అందరికి ఆరోగ్యంగా ఉంటుందని సూచించారు. భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరం యోగా అని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో దోహదపడుతుందన్నారు.అన్ని వయస్సుల వారు యోగ అలవాటు చేసుకోవాలని సూచించారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది జరుపుకోవడం భారతీయ సంస్కృతికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను నెలకొల్పడంలో యోగా ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. అనంతరం అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, విద్యార్థులు యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకుంటే ఏకాగ్రత పెరిగి విద్యారంగంలో మంచి ఫలితాలు సాధించగలరని తెలిపారు.యోగా ద్వారా ఆరోగ్యవంతమైన జీవన విధానం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణ కోసం అలవాటు చేసుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సామూహికంగా యోగా సాధన నిర్వహించి ఆరోగ్య అవగాహన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఆరోగ్య పరిరక్షణ, ఫిట్‌నెస్‌పై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కందునూరి సమతా కుమార్, అమిరి శెట్టి శ్రావణి రాకేష్, సిద్ధ తిరుపతి,వేగోళం పద్మ అబ్బయ్యగౌడ్, గాదాసు మంజుల రవీందర్,వాకర్స్ , అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి మంద శ్రీనివాస్ గౌడ్, అసోసియేషన్ అధ్యక్షులు చొప్పరి సుమన్ ప్రధాన కార్యదర్శి నిట్టూరి శ్రీనివాస్ కోశాధికారి కామణి శ్రీకాంత్ గౌరవ అధ్యక్షులు అమిరి శెట్టి రాజలింగం, ముఖ్య సలహాదారులు చిలగాని లక్ష్మణ్ మాదర బోయిన రాజేంద్రప్రసాద్, సాదుల సుగుణాకర్ సహాయ కార్యదర్శి కొలిపాక రవీందర్, క్రీడా కోచ్ వెంకటేష్,జాయింట్ సెక్రెటరీ ఎలిగేటి రమేష్, లీగల్ అడ్వైజర్, కోడెం అజయ్, గుడ్ల వెంకటేష్, ప్రచార కార్యదర్శి సుంక వేణు, కార్యవర్గ సభ్యులు, బూడిద స్వామి మద్దెల కొమురయ్య సల్కం శ్రీనివాస్ శ్రీగిరి సుధాకర్, ఉల్లంగుల శ్రీనివాస్, దర్శనాల, రామచంద్రం, రామకృష్ణ, భైరగోని ప్రభాకర్ వాకర్ సభ్యులు, ఎలగందుల మల్లేశం, అడ్వకేట్ ఆవుల శివ, పోడేటి వెంకటేష్, రమణ, కట్ల రాజమౌళి ఎండి ఖాసిం బాలసాని శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, బిక్షపతి, కట్ల శ్రీనివాస్, లింగమూర్తి, అమిరి శెట్టి తిరుపతి, గంధం రాజేష్, గడ్డం శ్రీనివాస్, పిడుగు పోచాలు, కలగూర విజయ్ కుమార్, శ్రీశైలం, వెంకటపతి, రాఘవులు, కొమురవెల్లి ప్రభాకర్, ఎల్లయ్య, సతీష్ రావు,అంతటి సంతోష్, సిరిపురం రమేష్, ఎల్లయ్య స్థానిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు, యువకులు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సీనియర్ క్రీడాకారులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# ఎన్టీపీసీలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం..



**గోదావరిఖని, జనంసాక్షి:**
రామగుండం ఎన్టీపీసీ అండ్ తెలంగాణ ప్రాజెక్టులో 12వ అంతర్జాతీయో యోగా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు.శారీరక, మానసిక భావోద్వేగ శ్రేయస్సును సాధించడంలో యోగా ప్రాముఖ్యతను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి,ప్రముఖుల రాకతో కార్యక్రమం ప్రారంభమైంది.అనంతరం లాంఛనప్రాయంగా జ్యోతి ప్రజ్వలన జరిగింది. జీవన విధానంగా యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తూ, భారత ప్రధాన మంత్రి,ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ గురుదేవ్ అందించిన స్ఫూర్తిదాయక వీడియో సందేశాలను పాల్గొన్నవారు వీక్షించారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రాముఖ్యతపై ఒక సంక్షిప్త సమావేశం నిర్వహించారు.అనంతరం ఆర్ట్ ఆఫ్ లివింగ్ అధ్యాపక బృందాన్ని పరిచయం చేశారు.ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా ఒత్తిడి నిర్వహణ నిపుణులు టి.రమణప్రసాద్, యోగా శిక్షకురాలు వై.మాధవి నిర్వహించిన 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా' అనే ప్రత్యేక సదస్సు నిలిచింది.శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం, ఆరోగ్యకరమైన జీవనశైలిని కాపాడుకోవడానికి అవసరమైన సరళమైన, ప్రభావవంతమైన యోగా పద్ధతులపై ఈ సదస్సు దృష్టి సారించింది. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో తమ వంతు సహకారం అందించిన అధ్యాపక బృందాన్ని, అంతర్గత సమన్వయకర్తలను సన్మానించారు. ముఖ్య అతిథి సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, సంపూర్ణ శ్రేయస్సును,ఉత్పాదకతను పెంచడంలో యోగా పాత్రను నొక్కి చెప్పారు.అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పాటించడం ద్వారా, తమ ఉద్యోగులు, భాగస్వాములలో ఆరోగ్యం, శ్రేయస్సు, సంపూర్ణ అభివృద్ధి సంస్కృతిని పెంపొందించడానికి ఎన్టిపిసి రామగుండం అండ్ తెలంగాణ కట్టుబడి ఉన్నాయని పునరుద్ఘాటించింది.



## మంచిరామి గ్రామంలో
# దేవతలకు జలాభిషేకం

**సుల్తానాబాద్,జూన్ 21(జనంసాక్షి) :**
మండలంలోని మంచిరామి గ్రామంలో సర్పంచ్ ఉప్పు లక్ష్మి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఉప్పు తిరుపతి ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు నీళ్లతో ప్రత్యేక అభిషేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ శ్రేయస్సు, ప్రజల సుఖసంతోషాలు, సమృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

# ఎలక్ట్రిక్ బస్సుల వినియోగంపై ప్రభుత్వం పునరాలోచించాలి
## సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

**కరీంనగర్ టౌన్, జూన్ 21 ( జనంసాక్షి)**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కరీంనగర్ సమీపంలో ఎలక్ట్రిక్ బస్సు అగ్నిప్రమాదానికి గురైన నేపథ్యంలో ఈ బస్సుల భద్రతపై సమగ్ర పరీక్షలు నిర్వహించిన తర్వాతే వాటిని ప్రజా రవాణాకు అనుమతించాలని ఆయన కోరారు.ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కరీంనగర్?హైదరాబాద్ మార్గంలో నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు తరచూ మధ్యలో ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీంతో ప్రయాణికులు సకాలంలో తమ గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
ఇటీవల కరీంనగర్ సమీపంలోని ఎల్ఎండీ వద్ద ఒక ఎలక్ట్రిక్ బస్సులో పొగలు రావడాన్ని డ్రైవర్ గమనించి వెంటనే బస్సును నిలిపివేయడంతో 41 మంది ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారని గుర్తు చేశారు. ఇదే ఘటన రాత్రి సమయంలో జరిగి ఉంటే డ్రైవర్‌కు వెంటనే గుర్తించే అవకాశం ఉండకపోవచ్చని, దాంతో భారీ ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉండేదని అన్నారు.
ఎలక్ట్రిక్ బస్సుల్లో కనీస ఫైర్ సేఫ్టీ పరికరాలు కూడా తగిన స్థాయిలో లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని పంజాల శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రైవేట్ సంస్థల బస్సులను వినియోగించడం ద్వారా ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు.జేబీఎం వంటి ప్రైవేట్ కంపెనీల బస్సులను అద్దె ప్రాతిపదికన నడుపుతూ ఆర్టీసీని క్రమంగా ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్తున్నారని ఆయన ఆరోపించారు. ఆర్టీసీకి సొంతంగా కొత్త బస్సులను కొనుగోలు చేయకుండా ప్రైవేట్ సంస్థలపై ఆధారపడటం సరైన విధానం కాదన్నారు.ఎలక్ట్రిక్ బస్సుల భద్రతపై పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించి, అవసరమైన సాంకేతిక మరియు భద్రతా చర్యలు అమలు చేసే వరకు వాటిలో ప్రయాణికుల రవాణాను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. ప్రయాణికుల ప్రాణాలకు ఎలాంటి ముప్పు లేకుండా భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన కోరారు.

# స్నేహితుడి వైద్య ఖర్చులకోసం ఆర్థిక సాయం అందజేత..
## ఆదర్శంగా నిలుస్తున్న 2001-02 బ్యాచ్ విద్యార్థులు




చిగురుమామిడి జూన్ 21(జనంసాక్షి): కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన బరిగేల రమేష్ అనారోగ్యంతో బాధపడుతూ,ఆర్థిక ఇబ్బందుల కారణంగా నాణ్యమైన వైద్యం పొందలేని పరిస్థితిలో ఉన్నాడన్న విషయం తెలుసుకున్న రమేష్ చిన్ననాటి స్నేహితులు అందరు కలిసి వైద్య ఖర్చుల కోసం 15వేల రూపాయలను జమ చేసి ఆదివారం అందజేశారు.ఈ సందర్భంగా రమేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సంబంధిత వైద్యులతో మాట్లాడి నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని కోరారు. సంతోషంలోనే కాదు ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా 2001–02 ఎస్ఎస్సి బ్యాచ్ విద్యార్థులు అందుబాటులో ఉండి తగిన సహాయం అందజేస్తామని వారు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ యువ న్యాయవాది కక్కెర్ల శివశంకర్ గౌడ్,తాళ్లపల్లి కిరణ్ కుమార్ గౌడ్,గంధం ఓదెల్ పటేల్,మెడబోయిన శ్రీనివాస్,బొల్లాబత్తిని సంతోష్, జీల మల్లేష్,మారుపాక రమేష్,బొమ్మగాని కృష్ణ గౌడ్,మొలుగురి శ్రావణ్,జీల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్య సంపద..
# ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా అవసరం

## డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్

కరీంనగర్ కల్చరల్, జూన్ 21 ( జనం సాక్షి ) ప్రపంచానికి భారతదేశం అందించిన అమూల్యమైన ఆరోగ్య సంపద యోగా అని జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి (డివైఎస్ఓ) శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప ప్రాచీన వారసత్వమని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానానికి ప్రతీకగా నిలిచిన యోగా నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది జీవితాల్లో భాగమైందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో యోగాకు లభిస్తున్న ఆదరణ ప్రతి భారతీయుడికి గర్వకారణమన్నారు. ప్రస్తుత జీవనశైలి మార్పుల వల్ల వెన్నునొప్పి, మెడనొప్పి, మోకాళ్ల నొప్పులు, రక్తపోటు, మధుమేహం వంటి అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, వీటి నివారణలో యోగా, ప్రాణాయామం, ధ్యానం కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. యోగా సాధనకు ప్రత్యేక పరికరాలు లేదా ఖరీదైన జిమ్‌లు అవసరం లేదని, ఇంట్లోనే ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి యోగా చేయవచ్చని సూచించారు. వయస్సుతో సంబంధం లేకుండా క్రమశిక్షణతో యోగా సాధన చేస్తే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. విద్యార్థులకు యోగా, ప్రాణాయామం, ధ్యానం ఎంతో ఉపయోగకరమని, అనులోమ-విలోమ, భ్రమరి వంటి ప్రాణాయామాలు ఏకాగ్రతను పెంచి చదువులో మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. కరోనా అనంతరం యోగాపై ప్రజల్లో మరింత అవగాహన పెరిగిందని, ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ యోగా ఆసనాలు ఆకట్టుకున్నాయి. అనంతరం రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను ఘనంగా సన్మానించారు.





ఈ కార్యక్రమంలో తెలంగాణ యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు టి. రమేష్ రెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి గుంటి రామకృష్ణ, పెటా అధ్యక్షుడు బాబు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆడెపు శ్రీనివాస్, యోగా కోచ్‌లు, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# టాస్క్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన

## - జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్

**పెద్దపల్లి,జూన్ 21(జనంసాక్షి) :** జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ, ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఎంపికైన అభ్యర్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించడంతో పాటు, ప్రముఖ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, 10వ తరగతి, ఇంటర్మీడియట్,డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని, అభ్యర్థుల వయస్సు 18 నుండి 28 సంవత్సరాల మధ్య ఉండాలని,ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూన్ 22, ఉదయం 10:00 గంటలకు టాస్క్ ప్రాంతీయ కేంద్రం,పెద్దపల్లి ఆర్టీసీ బస్టాండ్ బస్ డిపో ప్రాంగణం పక్కన హాజరు కావాలని,మరిన్ని వివరాలకు 9154909057, 9959892960 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# జూన్ 24న ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహణ

## - జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కె.శ్రీధర్

పెద్దపల్లి,జూన్ 21(జనంసాక్షి) : జూన్ 24న పెద్దపల్లి ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని,ఆసక్తి అర్హత గల అభ్యర్థులు హాజరుకావాలని జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో గల తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న 2 సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఎం.బి.బి.ఎస్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని అన్నారు. ఆసక్తి గల వైద్యులు తమ యొక్క దరఖాస్తు బయోడేటా తో పాటు అన్ని విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్ల తో పాటు జిరాక్స్ ప్రతులు ఒక సెట్ తో హాజరు కావాలని,సివిల్ అసిస్టెంట్ సర్జన్ కి వేతనం రూపాయలు 52,351 ఉంటుందని ,ఇతర వివరాలకు 9492457809, 8499061999 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.





# రాష్ట్ర న్యాయాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జాతీయ లోక్ అదాలత్

**పెద్దపల్లి,జూన్ 21(జనంసాక్షి) :** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారము శనివారం రంగంపల్లిలోని జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ న్యాయ విగ్యాన సదస్సు సునీత కుంచాల ఆధ్వర్యంలో లోక అదాలత్ నిర్వహించారు. ఈ సదస్సులో కే స్వప్న రాణి అదనపు జిల్లా న్యా యమూర్తి వంగర భవాని కార్యదర్శి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎన్ మంజుల జూనియర్ సివిల్ జడ్జ్ రాంరెడ్డి ఐపిఎస్ డిసిపి డొంకెన రవీందర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మేకల మల్లేశం రాచూరి శ్రీకాంత్ అధ్యక్ష కార్యదర్శులు మరియు కార్యవర్గ సభ్యులు మరియు న్యాయవాదులు కే శ్రీధర్ లోక్ అదాలత్ నెంబర్ శ్రీనివాస్ భాను సంకీర్తన లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు, విజయ రంగ రెడ్డి ఇన్సూరెన్సు తరుపున న్యాయవాది,గోపాల్ రెడ్డి గోదావరిఖని కోర్టుకు సంబందించిన న్యాయవాది పోలీస్ అధికారులు బ్యాంక్ అధికారులు కక్షి దారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్ లో రాజి మార్గంలో రాజి చేసుకున్నట్టయితే సమయము మరియు డబ్బులు కూడా ఆదా చేసుకోవచ్చని తెలిపినారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే లోక్ అదాలత్ లలో కక్ష దారులు అందరుకూడా తమ తమ కేసులను పరిష్కారించుకోగలరని కోరారు. అలాగే ఈ రోజు పెద్దపల్లి జిల్లలో వున్నా అన్ని కోర్టులలో మొత్తం 1984 కేసులు అంటే సుల్తానాబాద్ కోర్ట్ కు సంబందించినవి 543, గోదావరిఖని-519, మంథని -196, పెద్దపల్లి మరియు నన్దిమ్యదారం కు సంబంధించి 725 కేసులు రాజి మార్గం ద్వారా పరిష్కరించబడినివని తెలిపినారు. గోదావరిఖని కోర్ట్ కు సంబందించిన మోటార్ వాహన ప్రమాద భీమా కేసులో 1,14,25,000/- పరిహారింగా ఇప్పించారు.



# ఖేలో ఇండియా ఖో ఖో సెంటర్ లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

## - హాజరైన క్రీడా శాఖ అధికారి సురేష్ కుమార్

**సుల్తానాబాద్,జూన్ 21(జనంసాక్షి) :** సుల్తానాబాద్‌లోని ఖేలో ఇండియా ఖో ఖో సెంటర్‌లో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై యోగా ఆసనాలను పరిశీలించి క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యోగా మన శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని, నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడు తుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం విశిష్టతను వివరిస్తూ యోగా ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ, మానసిక ప్రశాంతత పెరుగుతాయని పేర్కొన్నారు. తెలంగాణ ఒలింపిక్ సంఘం సభ్యులు సిలివేరి మహేందర్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్



కార్యదర్శి అమిరిశెట్టి తిరుపతి లు మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని, యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి యోగా ఎంతో అవసరమని తెలిపారు. ఖేలో ఇండియా ఖో ఖో సెంటర్ కోచ్, మాజీ భారత జట్టు ఖో ఖో క్రీడాకారుడు గెల్లు మధుకర్ యాదవ్ ఆధ్వర్యంలో యోగా ప్రదర్శనలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు వెంకటేష్, రాజేష్, వాకర్స్ సంగం అధ్యక్ష కార్యదర్శులు సుమన్ , శ్రీనివాస్, ఖో ఖో క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సంద ర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం క్రీడా కారుల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందిం చడంతో పాటు యోగా ప్రాముఖ్యతను మరింతగా చాటిచెప్పింది. అనంతరం ఖేలో ఇండియా ఖో ఖో సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్ కుమార్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు.



శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణంలో

## ఉచిత కైరో ప్రాక్టీక్ వైద్య శిబిరం

**ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న 30మంది**

**చిగురుమామిడి జూన్ 21(జనంసాక్షి):**
శ్రీపాంబండ పంచముఖ ఆంజనేయ స్వామి పీఠం ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఉచిత కైరో ప్రాక్టీక్ వైద్య శిబిరంను ఆదివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రముఖ ప్రఖ్యాత కైరో ప్రాక్టిక్ వైద్య నిపుణులు ఆడెపు రాజేష్ ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం మందులు లేనటువంటి మెడ,కండరాలు,నడుము వెన్ను,కీళ్లు,సైటికా,ఆర్థో,నర్వ్ కు సంబందించిన సమస్యలకు ఎక్సటర్నల్ ట్రీట్మెంట్,సలహాలతో పూజ్య గురూజీ శ్రీశ్రీశ్రీ హమేష్ స్వామి వారి సారథ్యంలో వారి బృందంతో భక్తులు అధిక సంఖ్యలో సేవలు వినియోగించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఐరెడ్డి ధర్మేందర్,తేరాల అమర్, కొలువూరి మోహనరెడ్డి,ప్రవీణ్, అనిల్,పవన్, సురేష్, సంపత్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిగురుమామిడి కరీంనగర్ డెయిరీ అధ్యక్షుడిగా పన్యాల శ్రీధర్ రెడ్డి ఎన్నిక..

### 15వసారి శ్రీధర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్న డైరెక్టర్లు,పాల ఉత్పత్తిదారులు...

### డైరెక్టర్లుగా పొతర్ల శివఆంజనేయులు,మడమడకల మాధవరెడ్డిల ఎన్నిక..

**చిగురుమామిడి జూన్ 21(జనంసాక్షి):**
పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయంగా,పాల కేంద్రం అభివృద్దే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని పాల కేంద్రం అధ్యక్షుడు పన్యాల శ్రీధర్ రెడ్డి తెలిపారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని కరీంనగర్ డెయిరీ జనరల్ బాడీ సమావేశం ఆదివారం మేనేజర్ చింతపూల నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.అనంతరం అధ్యక్షుడిగా పన్యాల శ్రీధర్ రెడ్డిని,డైరెక్టర్లుగా పోతర్ల శివాంజనేయులు, మడమడకల మాధవరెడ్డిని ఎన్నుకున్నట్లు మేనేజర్ నాగయ్య తెలిపారు. అనంతరం మేనేజర్ నాగయ్య మాట్లాడుతూ రైతులు మేలైన జాతికి చెందిన గేదెలను,ఆవులను కొనుగోలు చేసి పాల ఉత్పత్తిని పెంచుకోవాలని సూచించారు. కరీంనగర్ డెయిరీ పాల ఉత్పత్తిదారుల కష్టనష్టాల్లో పాలుపంచుకుంటుందన్నారు. పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలను కరీంనగర్ డైరీ అమలు చేస్తుందని గుర్తు చేశారు.5వందల లీటర్ల పాల ఉత్పత్తిని వెయ్యి లీటర్లకు పెంచాలని సూచించారు.పాల ఉత్పత్తిదారులకు కూల్ వాటర్ క్యాన్స్ ను అందజేశారు.ఈ కార్యక్రమంలో రూట్ సూపర్వైజర్ అప్పాల మల్లయ్య,డైరెక్టర్లు పెనుకుల సంపత్,చొప్పదండి సుధాకర్,పొన్నం బాలయ్య, పొతరవేణి అనిల్,మల్లం కుమారస్వామి,పోలోజు రజిత,పెనుకుల స్వప్న,పాల కేంద్రం కార్యదర్శి చకిలం శ్రీనివాస్,టెస్టర్ మల్లం శ్రీనివాస్ తోపాటు పాల ఉత్పత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలపై బస్టాండ్, ఐటిఐ, రైల్వే స్టేషన్ లో తనిఖీ నిర్వహించిన పోలీసులు



**పెద్దపల్లి,జూన్ 21(జనంసాక్షి) :**
పెద్దపల్లి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, ఐటిఐ, రైల్వే స్టేషన్ లలో ఆదివారం రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా(ఐపీఎస్ )ప్రదేశాల మేరకు పెద్దపల్లి సిఐ కే ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నార్కోటిక్ జాగిలంతో అనుమానితుల వద్ద తనఖి నిర్వహించారు.ఈ సందర్భంగా ఏ ఎస్ ఐ ఎం డి గౌస్ మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాలతో మత్తు, గంజాయి, డ్రగ్స్ పదార్థాల రవాణాపై నిత్యం తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



## సల్లంగా చూడో పోచమ్మ తల్లో...

## లంబాడిపల్లె యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ బోనాలు..

**చిగురుమామిడి జూన్ 21(జనంసాక్షి):**
సల్లంగా సూడో పోచమ్మ తల్లో అంటూ కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లంబాడిపల్లె గ్రామంలో యాదవ సంఘం అధ్యక్షుడు చందబోయిన సంపత్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద ఎత్తున పోచమ్మ తల్లికి బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతి గడప నుండి డప్పు చప్పులు శివసత్తుల పూనకాలతో గ్రామంలోని పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు.పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని,వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని కోరుతూ ప్రతి సంవత్సరం యాదవ సంఘం ఆధ్వర్యంలో ఐకమత్యంతో బోనాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన బ్యానర్లు,వారి ఐక్యత పలువురికి ఆదర్శంగా నిలిచింది. భవిష్యత్తులో మరింత ఐక్యతతో మరింత ఘనంగా నిర్వహిస్తామని యాదవ్ సంఘం అధ్యక్షుడు చందబోయిన సంపత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నక్క ఓదెలు,చందబోయిన ఎల్లయ్య,నక్క రాజేందర్, చందబోయిన పరశురాములు,చందబోయిన శ్రీనివాస్,చందబోయిన రాజు,చందబోయిన బాలయ్య, ఎల్లయ్య,ఎల్లయ్య,కనకయ్య, వెంకయ్య,రాజు,మల్లయ్య,నక్క నాగరాజు, సంపత్, మల్లయ్య, ఓదెలు,పరశురాములు,జీల శంకరయ్య, చంద్రయ్య, కనకయ్య,రాజు,ఐలయ్య,మల్లయ్య,మండల నాగయ్య,ఎల్లవేణి కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.



### ప్రభుత్వం పారదర్శకంగా

## యూరియా సరఫరా చేస్తుంది

**ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు మానుకోవాలి**

**యూరియా కొరత లేదు**

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోనగిరి భాస్కర్**

**కమ్మర్పల్లి జూన్ 21(జనంసాక్షి)**
రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా యూరియా సరఫరా చేస్తుంది. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు మానుకోవాలి.యూరియా కొరత లేదు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోనగిరి భాస్కర్ పేర్కొన్నారు.ఆదివారం రోజున మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం లో బోనగిరి భాస్కర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దని, అధికారిక సమాచారం ఆధారంగా వ్యవహరించాలని సూచించారు.యూరియా సరఫరా లో ఇబ్బందులు తేలేతకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రైతులు అవసరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగ్గిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సొసైటీ చైర్మన్లు సకాలంలో యూరియాని అందుబాటులో ఉంచి పారదర్శకంగా రైతులకు యూరియా సరఫరా చేయాలని కోరారుఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డిసిసి నాయకులు డాక్టర్ మురళి,పడిగేల ప్రవీణ్, తిప్పిరెడ్డి శ్రీనివాస్, తక్కరి దేవేందర్,కమ్మర్పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు సల్లూరి గణేష్, ఉప్లూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు డాక్టర్ నరేష్,చౌటపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు రవీందర్,బషీరాబాద్ గ్రామ శాఖ అధ్యక్షుడు భూమేశ్వర్,యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శైలేందర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంట ఆనంద్, నిమ్మ రాజేంద్రప్రసాద్,లింగారెడ్డి, గణేష్,షాదుల్లా,పూజారి శేఖర్, ముఖీమ్ తదితరులు పాల్గొన్నారు.

## సమీకృత గురుకులలతో సామాజికమైన మార్పు కొంకటి లింగమూర్తి

**పెద్దపల్లి,జూన్ 21(జనంసాక్షి) :**



ఇన్ ఇండియా స్కూల్స్ లో విద్యనాభ్యసిస్తున్న విద్యార్థులు భవిష్యత్తులో దేశాన్ని పాలించే స్థాయికి ఎదగాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించడం ఆయన గొప్పతనానికి నిదర్శనం అని శూద్ర కులాల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కొంకటి లింగమూర్తి అన్నారు.

శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో కుల వ్యవస్థ నిర్మూలన లక్ష్యంతో సమీకృత గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆలోచనలను ఆయన స్వాగతించారు. బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కృషి వల్ల దేశంలో అనేక మార్పులు వచ్చాయనీ ప్రస్తుత యువత మరో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లు కావాలని అప్పుడే దేశం మరింత మెరుగుపడుతుందనీ విద్యా అవకాశాలు విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు. భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందని వెనుకబడిన వర్గాల అభ్యున్నతకి విద్య ప్రధాన సాధన అన్నారు.

## జూలపల్లి లో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**పెద్దపల్లి,జూన్ 21(జనంసాక్షి) :**
జూలపల్లి మండల కేంద్రంలో జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగా టీం సభ్యులు సూర్య నమస్కారాలు, ఆసనాలు, ప్రాణాయామం సాధన చేశారు.స్థానిక యోగా టీమ్ ఆర్గనైజర్ అమరగాని ప్రదీప్ కుమార్‌లి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతిరోజు యోగా సాధన చేస్తూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని, శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు.మన యొక్క ఋషులు మునులు అందించిన అతి గొప్ప సంపూర్ణ ఆరోగ్య సాధనం యోగా అని ప్రతి ఒక్కరూ ఆచరించి ముందుకెళ్లాలనిఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా మన యోగాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది ప్రతీ ఏటా నేడు యోగ దినోత్సవం గా జరుపుకోవడం అ భి న ం ద నీ య ం వ ం ని వివరించారు.ఈ కార్యక్రమంలో అమరగాని ప్రదీప్ కుమార్, యోగా టీమ్ సభ్యులు అందె శివ ప్రసాద్, కనపర్తి రాజేందర్, ఎలిగేటి శ్రీనివాస్, గంగిపెల్లి మల్లయ్య, భాస్కర్, అట్ల ఆంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.



# ఫాదర్స్ డే సందర్భంగా ఆంజనేయ శర్మ జ్ఞాపకార్థం ఉచిత థైయిరైడు క్యాంపు



ఇల్లంతకుంట జూన్ 21(జనంసాక్షి )
ఫాదర్స్ డే పురస్కరించుకొని వాసుదేవ హాస్పిటల్ డాక్టర్ ఎలగందల శ్రీనివాస్, అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 137 ఏ ఆధ్వర్యంలో ఉచిత థైరాయిడ్ పరీక్షలు ఇల్లంతకుంట, రహీంఖాన్ పేట లో నిర్వహించడం జరిగింది . ఇల్లంతకుంటలో కీర్తిశేషులు అల్లాడి ఆంజనేయ శర్మ జ్ఞాపకార్థం ఉచిత థైరాయిడ్ పరీక్షలను అతని స్వగృహమునందు నిర్వహించడం జరిగింది . అంతే కాకుండా ఈరోజు రహీంఖాన్పేటలో కొత్త అలయన్స్ క్లబ్ ఏర్పాటు చేయడం జరిగింది. దానిలో భాగంగా అక్కడ ఉచిత థైరాయిడ్ పరీక్షలు నిర్వహించడం జరిగింది .ఇట్టి ఉచిత క్యాంపు నుపయోగించి డాక్టర్ ఎలగందల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉచిత స్క్రీనింగ్ క్యాంపులు అందుబాటులోకి తీసుకువస్తానని చెప్పారు. ఈ ఉచిత క్యాంప్లో పాల్గొన్న వాళ్లందరికీ కూడా మూడు నెలల వరకు ఎటువంటి ఫీజు లేకుండా ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తానని ఏదైనా అవసరమున్న టెస్టులు ఇంకా ఏమైనా ఉంటే దానిలో చాలా వరకు తగ్గించి పరీక్షలు చేస్తానని శ్రీనివాస్ చెప్పారు. ఈరోజు వాసుదేవ హాస్పిటల్ లో 50 శాంపిల్స్ ఇల్లంతకుంటలో 70 శాంపిల్స్ రహీంఖాన్పేటలో 35 శాంపిల్స్ తీసుకోవడం జరిగింద పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్ కొటాం లావణ్య రాములు ఉపసర్పంచ్ గడ్డమీది పద్మ అంజయ్య,డాక్టర్స్ ఎలగందల శ్రీనివాస్ , సునీల్ రాజ్ , అశోక్ ,సాయి మేఘన , తేజ వాసుదేవా హాస్పిటల్ సిబ్బంది అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొంజర్ల మహేష్ ఇంజనీర్ ,కోల అన్నారెడ్డి ,పుల్లల శ్యామ్ ,వి డి జి వన్ ప్రసాద్ ,సాగర్ ,పందుగ నాగరాజు ,కుమారస్వామి ,నాగేశ్వర్ ,వెంకటేశ్వర్లు జెడ్ సి చైర్మన్ అల్లాడి ఆనంద్ కుమార్, గడ్డమీది శ్రీనివాస్, రాజేందర్, అశోక్ ,పర్శరాములు ,అంతగిరి వినయ్,హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు



## నిరుపేద చిన్నారులకు ఆర్థిక సాయం అందించిన చిట్లేని వెంకటేశ్వరరావు మాధవి

ముస్తాబాద్ మండల తుర్కపల్లి గ్రామానికి చెందిన నంగనూరి లతా గత ఐదు నెల క్రితం క్యాన్సర్ తో మృతి చెంది.మృతురాలుకు ఇద్దరు చిన్న కుమారులు పెద్ద కుమారుడు వికలాంగుడు పూర్తిగా నడవలేని స్థితిలో ఉన్నాడు. ఈ సమాచారాన్ని చెట్లేని శ్రీనివాసరావు సమాచారం అందించడంతో హైదరాబాదులో ఉన్నటువంటి చిట్లేని మాధవి వెంకటేశ్వరరావు వెంటనే స్పందించి నిత్యావసర సరుకులు, చిన్న పిల్లలకు పాల డబ్బాలు, 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు. నామాపూర్ గ్రామంలో అమ్మమ్మ దేవవ్వ, తాతయ్య చంద్రయ్యకు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ బిజెపి మండల అధ్యక్షులు మెరుగు గౌడ్, పాల్గొన్నారు.

## బెజవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న మున్సిపల్ చైర్మన్



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 21 (జనంసాక్షి)
విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని ఆదివారం వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు,కౌన్సిలర్లు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పై కనకదుర్గమ్మ ఆశీస్సులు ఉండాలని, వేములవాడ పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు,రైతంగం ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి,పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు నిండాలని తాము ప్రత్యేకంగా ప్రార్థించామన్నారు. దర్శనానంతరం ఆలయ అధికారులు మున్సిపల్ చైర్పర్సన్ పుల్కం రాజు, కౌన్సిలర్లకు వేదొక్త ఆశీర్వచనం నిర్వహించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

# రైతులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

## బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు బొంపల్లి సురేందర్ రావు



ముస్తాబాద్ జూన్ 21 (జనం సాక్షి)
ముస్తాబాద్ మండల కేంద్రంలో బిఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మండల శాఖ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించి నా బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు బొంపల్లి సురేందర్ రావు మాట్లాడుతూ రైతులకు యురియా సమస్య వల్ల ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులకు యాప్ పెట్టి సతమతమవుతున్న రైతన్న వెంటనే యాప్ ను లగించి రైతులకు నేరుగా యూరియా, దుక్కిమందు, అందించాలి ఇంతవరకు కూడా రైతు భరోసా అందలేదు రుణమాఫీ పూర్తి కాలేదు సరైన సమయానికి వర్షాలు లేక నెత్తికి చేతులు పెట్టి ఎదురుచూస్తున్న రైతులు ఓ పక్క వ్యవసాయానికి తెచ్చుకున్న అప్పు తీర్చలేక సూర్య యురియా కోసం జూలైలో చెప్పులు పెట్టి ప్రదర్శన చేస్తున్నారు అయిన ప్రభుత్వం నిమ్మకు నీరు తినడం వివరిస్తుంది. ఇప్పటికైనా సమయానికి రైతులకు యూరియా అందించకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ముస్తాబాద్ మండల బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు భోంపెల్లి సురేందర్ రావు,ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ కో అప్షన్ మెంబర్ సర్వర్ పాషా,ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు ఏద్దండి నర్సింహా రెడ్డి, ముస్తాబాద్ మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య,మాజీ ఉప సర్పంచ్ కొండ శ్రీనివాస్ గౌడ్, ముస్తాబాద్ పట్టణ మాజీ అధ్యక్షులు రాచమడుగు సంతోష్ రావు, బిఆర్ ఎస్ పార్టీ నాయకులు చెవులు మల్లేశం యాదవ్,ముస్తాబాద్ మండల యూత్ అధ్యక్షులు శీలం స్వామి, మాజీ ఎంపీటీసీ చంద్రారెడ్డి,తాళ్ల రాజు, శీలం వెంకటేష్,ముస్తాబాద్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు గూడూరి భరత్, పోతుగల్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రేపాక బాల్ నర్సు, పార్టీ సోషల్ మీడియా వారియర్స్ పరిదిపేట వెంకటేష్, వంగూరి దిలీప్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కిరాణా షాపుల్లో అకస్మిక తనిఖీలు నిర్వహించిన ఎస్సై జి జ్యోతి

ముస్తాబాద్ జూన్ 21 (జనం సాక్షి)
ముస్తాబాద్ మండల కేంద్రంలోని స్థానిక ఎస్సై జి జ్యోతి ఆధ్వర్యంలో కిరాణా షాపులు, పాన్ షాపులు, బస్టాండ్ హాస్టల్, పాఠశాలలు, హోటళ్లు ,కళాశాలలో నార్కోటిక్ డాగ్స్ సాయంతో అకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై జ్యోతి మాట్లాడుతూ మండల కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే . ఎవరైనా గంజాయి తాగినట్లు కనిపిస్తే. అమ్మినట్లు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలి. మాదకద్రవ్యాల అక్రమ రవాణ విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు. అనుమానస్పద కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని స్థానిక ఎస్సై జ్యోతి కోరారు . ఎస్ఐ గని , పోలీస్ సిబ్బంది డాగ్స్ తో పాల్గొన్నారు.



# ఆర్టీసీ బస్సును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## కాంగ్రెస్ మండల అధ్యక్షులు దొంత సుధాకర్



సైదాపూర్ జూన్ 21( జనంసాక్షి)
సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి గ్రామంలో కరీంనగర్ కు నూతన ఆర్టీసీ బస్సును ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, దొంత సుధాకర్ అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పూర్ణ ప్రభాకర్ గారి ప్రత్యేక చొరవతో గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని..ఈ బస్సు కరీంనగర్ నుండి మాన కొండూరు, ముంజంపల్లి, పోరండ్ల, మన్నెంపల్లి, మల్లాపూర్,పోలంపల్లి,మొగిలిపాలెం ,రేకొండ, బొమ్మనపల్లి,దుద్దెనపల్లి,ఎక్లాస్పూర్,సోమారం చౌరస్తా,సైదాపూర్ నుండి తిరిగి దుద్దెనపల్లి, బొమ్మనపల్లి,రేకొండ,మొగిలిపాలెం,పోలంపల్లి,మల్లాపూర్,మన్నెంపల్లి,పోరండ్ల,ముంజంపల్లి,మానకొండూరు మీదుగా తిరిగి కరీంనగర్ వరకు ప్రయాణికులకు సేవలు అందించనుందని తెలిపారు.. విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు ప్రతిరోజు రాకపోకల విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ కొత్త బస్సు సర్వీసును అందుబాటులోకి తీసుకొచ్చామని.. ఈ సేవతో ప్రజలకు సమయం, ఖర్చు ఆదా కావడంతోపాటు వారి ప్రయాణాలు మరింత సౌకర్యవంతంగా మారను ఉన్నాయని అన్నారు.. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.. మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల లక్షలాదిమంది మహిళలు, విద్య, ఉపాధి వ్యాపారం కుటుంబ అవసరాల కోసం ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ప్రయాణించే అవకాశం పొందుతున్నారని పేర్కొన్నారు, మహిళల ఆర్థిక సాధికారతకు ఈ పథకం ఎంతో దోహదం పడుతుందని.. అంతేకాకుండా మండలంలోని ప్రతి గ్రామానికి మెరుగైన రవాణా అనుసంధానం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని రవాణా సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు..తమ చిరకాల కోరికను నెరవేర్చిన గౌరవ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గారికి మండల ప్రజలు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైదాపూర్ సహకార సంఘం అధ్యక్షులు కొత్త తిరుపరెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గుండారపు శ్రీనివాస్ దుద్దెనపల్లి ఎగ్లాస్పూర్ సోమారం గ్రామ సర్పంచ్ కందుల అనిత అంజి సోమరం ఉప సర్పంచ్, వీరగోని సదానందం వార్డ్ మెంబర్లు పడాల తిరుపతి చిలువేరి రాములు , ఆర్టీసీ అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు..

# ప్రొ. జయశంకర్ జీవిత చరిత్ర పాఠ్యాంశంగా చేర్చాలి

## న్యాయవాది కూర్మాచలం ఉమా మహేష్



**జగిత్యాల, జనం సాక్షి:**
తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమకారుడు, విద్యావేత్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా స్థానిక ఎస్.కే.ఎన్.ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ముందు గల ఆయన విగ్రహానికి పూలమాల సమర్పించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి, న్యాయవాది కూర్మాచలం ఉమా మహేష్ మాట్లాడుతూ.... ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దేశవ్యాప్తంగా వినిపించి, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన గొప్ప మేధావి అని కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.
తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాలను గణాంకాలతో సహా ప్రజలకు వివరించి, ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన నాయకుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. విద్యారంగంలోనూ, సామాజిక చైతన్య రంగంలోనూ ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.
నేటి యువత ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం ఆయన చూపిన మార్గం అందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విగ్రహ వ్యవస్థాపకులు న్యాయవాది కూర్మాచలం ఉమా మహేష్, స్థానిక కౌన్సిలర్ ఏనుగుల లావణ్య రాజేందర్, తెలంగాణ ఉద్యమ కారుడు ప్రహ్లాద శ్రీనివాస్ (అభి), బీజేపీ సీనియర్ నాయకుడు వీరబత్తిని అనిల్, మాజీ వైస్ ఎంపీపీ నల్ల శ్యామ్, సతీష్, పిల్లి శ్రీనివాస్, ములాసాపు రాజన్న, అత్తినేని శ్రీనివాస్, సురేందర్, పొలాస సత్యం, గడ్డం శ్రీనివాస్ కరుణాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షునిగా చింతల శ్రీధర్ రెడ్డి రెండోసారి ఎన్నిక

**గన్నేరువరం, జూన్ 21 (జనంసాక్షి):**
గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన చింతల శ్రీధర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షునిగా రెండోసారి ఎన్నికయ్యారు. మానకొండూరు నియోజవర్గ ఎమ్మెల్యే డాక్టర్. కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశానుసారం నియామక పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్ అందజేశారు. తన నియమకానికి సహకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కి శ్రీధర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మాతంగి అనిల్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు బుర్ర తిరుపతి గౌడ్, తొమ్మిదో వార్డ్ మెంబర్ వేదిరే విజేందర్, నాయకులు బుర్ర మల్లేశం గౌడ్, దేశరాజు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి భవనానికి భూమి పూజ చేసిన కేకే మహేందర్ రెడ్డి



**ముస్తాబాద్ జూన్ 21 (జనం సాక్షి)**
ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ మాదాస్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నూతన అంగన్వాడి భవనానికి భూమి పూజ. నిర్వహించిన సిరిసిల్ల ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో మంజూరైన అంగన్వాడి భవనానికి భూమి పూజ చేయడం జరిగింది పని త్వరలోనే ప్రారంభించి భవనాని పూర్తిచేసి అందిస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం నిరుపేదలకు సేవ చేయాలనే ఒక సంకల్పంతో ఇందిరమ్మ రాజ్యం, గూడు లేని వారికి ఇందిరమ్మిండ్లు అందిస్తూ ఉచిత కరెంటు, రైతుబంధు రుణమాఫీ, చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కొండెం రాజు రెడ్డి ,ఏఎంసి వైస్ చైర్మన్ వేలముల రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి, నాగపూర్ ఉప సర్పంచ్ కొమురయ్య, పంచాయతీ పాలకవర్గం పంచాయతీ కార్యదర్శి సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



## యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది, ఎస్సై జ్యోతి

**ముస్తాబాద్ జూన్ 21 (జనం సాక్షి)**
యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని, యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎస్సై జ్యోతి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పోలీస్ స్టేషన్ గ్రౌండ్లో ప్రాంగణంలో ఎస్సై జ్యోతి మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరిగి, ఆరోగ్యవంతమైన జీవన విధానం అలవడుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అందరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యోగా ఆసనాలు, ప్రాణాయామాలు నిర్వహించారు. సిబ్బంది పాల్గొన్నారు.




## అల్లిపూర్ లో యోగా కార్యక్రమం:

రాయికల్ జనం సాక్షి:
అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అల్లిపూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ ప్రాథమిక పాఠశాలలో యోగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎంబారి గౌతమి వెంకటేష్, ఉప సర్పంచ్ వినయ్, జడ్పీహెచ్ఎస్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్, ఆయుష్ డయోగ టీచర్లు,హై స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగ దినోత్సవం విద్యార్థులతో కలిసి యోగ సాధనలో పాల్గొన పోలీసులు

**ఇల్లంతకుంట జూన్ 21(జనంసాక్షి )**
యోగా శారీరక,మానసిక,ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పెంపొందించే సమగ్ర జీవన విధానమని ఎస్సైలు అశోక్,లక్పతి అన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇల్లంతకుంట మండల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం యోగా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు,సిబ్బంది,విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు.అనంతరం ఎస్సై సిరిసిల్ల అశోక్ మాట్లాడుతూ భారతీయ తత్వం ప్రతిపాదించే సార్వత్రిక విలువల మాదిరిగానే యోగ కూడా విశ్వవ్యాప్త భావనలను,ప్రాపంచిక దృక్పథాన్ని బోధిస్తుందన్నారు.యోగాలోని శక్తి,ప్రాముఖ్యత,రోగనిరోధక సామర్థ్యాన్ని గుర్తించిన ప్రపంచ దేశాల ప్రజలు దానిని తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకుంటున్నారని తెలిపారు.యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఏఎస్ఐలు,హెడ్ కానిస్టేబుళ్లు,కానిస్టేబుళ్లు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రపంచ యోగ దినోత్సవం.. నిత్యజీవితంలో భాగం చేసుకోవాలి

### యాంటీ డ్రగ్స్ వల్ల ప్రాణా నష్టం గురించి కరపత్రాలు విడుదల. శ్రీకాంత్, యోగ మాస్టర్ దేవయ్య, కరాటే మాస్టర్ విక్రమ్..



**గంభరావుపేట జూన్ 21 (జనం సాక్షి);**
యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, శరీరం–మనసు–ఆత్మల సమన్వయానికి దోహదపడే సమగ్ర జీవన విధానమని ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ అన్నారు, అంత ర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించు కుని ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం రోజు కేజీ టు పీజీ ఆవరణలో ముఖ్య అతిథిగా ఎస్సై శ్రీకాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, యాంటీ డ్రగ్స్ వల్ల యువత ప్రాణానిష్టం జరుగుతుందని, చెడు దారిన పడుతున్నా రని, దీనివల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, దీన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో ముందుకు వెళ్లాలని, సూచించారు. మానసిక ఒత్తిళు , వేగవంతమైన జీవనశైలితో కూడిన ప్రస్తుత కాలంలో యోగా ప్రతి ఒక్కరికీ అంతర్గత ప్రశాంతత, క్రమ శిక్షణ, సానుకూల శక్తిని అందిస్తుందని పేర్కొన్నారు. యోగా భారతీయ సనాతన జ్ఞాన సంపదకు ప్రతీకగా నిలిచి, నేడు ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య చైతన్యానికి మార్గ దర్శకంగా మారిందన్నారు. భారతీయుల ప్రాచీన వారసత్వమైన యోగా నేడు ప్రపం చానికి ఆరోగ్యం, మానసిక సమతుల్యత సం దేశాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. యోగా ను కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుం డా, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలోని ప్రతి పౌరుడు శారీరకంగా, మా నసికంగా దృఢంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంత మైన, సమృద్ధి చెందిన, ఆత్మనిర్భర్ భారత నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. “యోగతో ఆరోగ్యం, యోగతో సమతుల్యత, యోగతో ఆత్మబలం” అనే సందేశాన్ని ప్రజలు ఆచరణలో పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో యోగ మాస్టర్ దేవయ్య, కరాటే మాస్టర్ విక్రమ్, బిజెపి అధ్యక్షుడు, కోడె రమేష్, డాక్టర్ సత్యనారాయణ, మల్లేష్ యాదవ్, సింకోజి రమేష్, సంపత్, సంజీవరెడ్డి, వాసం శ్రీను, నాగరాజు గౌడ్, దోసల శ్రీనివాస్, సర్వోత్తమ్, దేవసాని కృష్ణ, మంగలి చంద్రమౌళి, దోసల శంకర్, రాజబాబు యువకులు పిల్లలు పాల్గొన్నారు,